క్లుప్తంగా

అధీకృత డీలర్ల వద్దే విత్తనాలు కొనుగోలు చేయాలి

మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు



నకరికల్లు: అధీకృత డీలర్ల వద్ద మాత్రమే రైతులు విత్తనాలు కొనుగోలు చేయాలని మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు సూచించారు. నకరికల్లులోని పలు విత్తన దుకాణాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులు, స్టాక్ పుస్తకాలు, రసీదులు పరిశీలించారు. విత్తన నిల్వలను పరిశీలించి మూడు రకాల విత్తన నమూనాలను నాణ్యత పరీక్షల కోసం తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు తప్పనిసరిగా రసీదు పొందాలన్నారు. రసీదుపై అమ్మకందారుని, కొనుగోలుదారుని సంతకం ఉండాలన్నారు. నాణ్యతలేని విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకుడు షేక్ సుభాని, డీలర్లు పాల్గొన్నారు.

టూ వీలర్ మెకానిక్‌లు ఐక్యతతో ఉండాలి



అచ్చంపేట: టూవీలర్ మెకానిక్‌లంతా ఐక్యతతో ఉండాలని, వాహనదారులకు మెరుగైన సేవలను అందిస్తూ జీవనోపాధి కొనసాగించాలని పల్నాడు జిల్లా మెకానిక్స్ యూనియన్ కార్యదర్శి బాబూ మేస్త్రి అన్నారు. ప్రపంచ మెకానిక్ దినోత్సవం సందర్భంగా స్థానిక ఆంజనేయస్వామి విగ్రహం వద్ద గురువారం యూనియన్ సభ్యులు కేక్ కట్ చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ఈ సందర్భంగా బాబూ మేస్త్రి మాట్లాడుతూ ఇప్పుడు ప్రతి ఇంటికి ఒకటి, రెండు ద్విచక్ర వాహనాలున్నాయన్నారు. వారందరికీ తమ ఆవశ్యకత ఉందన్నారు. మనమంతా ఐక్యతతో ఉండాలని వాహనదారులకు మెరుగైన సేవలందిస్తూ సమాజంలో గౌరవంగా జీవించాలని కోరారు. కార్యక్రమంలో సత్తెనపల్లి టౌన్ జాయింట్ సెక్రటరీ ఖాజావలి, అచ్చంపేట మండల యూనియన్ అధ్యక్షుడు నాగుల్‌మీరా, రఫిమేస్త్రి, కర్పూర్‌మేస్త్రి, సుభాని మేస్త్రి, ఇమాంవలి తదితరులు పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగిపై దాడి చేసిన వారిని శిక్షించాలి

సచివాలయ ఉద్యోగుల ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు కొండలరావు



సత్తెనపల్లి: సర్వేలో భాగంగా ఇంటి కొలతలు తీసుకుంటున్న విజయవాడ గవర్నర్‌పేట 98వ సచివాలయ అడ్మిన్ సెక్రటరీగా విధులు నిర్వహిస్తున్న లక్కావజ్ఝల అర్చనపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగుల ఫెడరేషన్ పల్నాడు జిల్లా అధ్యక్షుడు బిట్రా కొండలరావు డిమాండ్ చేశారు. ఈ దాడిని ఖండిస్తూ సత్తెనపల్లి మున్సిపల్ కార్యాలయం ఎదుట గురువారం నిరసన తెలిపారు. ఈ నిరసనలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఒక మహిళా ఉద్యోగిపై దాడి చేయడం ఎంత వరకు సబబని ప్రశ్నించారు. దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించటంతో పాటు ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. బాధితురాలు అర్చనకు న్యాయం జరిగే వరకు అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగుల ఫెడరేషన్ సత్తెనపల్లి శాఖ అధ్యక్షుడు సీహెచ్ ప్రదీప్, కమిటీ సభ్యులు వై.వంశీసాయి, ఆర్.గౌరీశంకర్, ఎం.సరిత, షేక్ సైదా, సందెపోగు శ్రీనివాస్ పాల్గొన్నారు.

నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా

ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్



పెదకూరపాడు: నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. గురువారం మండలంలోని హుస్సేన్ నగరం గ్రామంలో జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ తిరిగి సంవత్సర పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. కూటమి ప్రభుత్వం సంవత్సర పాలనపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని, సీఎం చంద్రబాబు స్ఫూర్తితో పెదకూరపాడు నియోజకవర్గాన్ని మరింతగా అభివృద్ధి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పెట్టుబడి తక్కువ.. ఆదాయం ఎక్కువ

- అంతర పంటల సాగుతో అధిక ఆదాయం
- మిరప, కంది పంటల్లో కూరగాయల సాగు
- మొక్కజొన్నలో మినుము, పెసర సాగు
- ప్రధాన పంటపై తగ్గనున్న చీడపీడల బెడద



మిరపలో సాగు చేసిన కూరగాయలను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు(ఫైల్)

ముప్పాళ్ళ: రైతులు మారుతున్న కాలంతో పాటు సాగులోను ఆధునిక విధానం పాటిస్తే లాభదాయకంగా ఉంటుందని, సాగులో ఉన్న పైరులోనే అంతర పంటలు సాగు చేస్తే అధిక ఆదాయాన్ని పొందవచ్చని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు. ఆ దిశగా మండలంలోని నార్నెపాడు, లంకెలకూరపాడు గ్రామాలకు చెందిన రైతులు ప్రధాన పంటల్లో అంతర పంటలు సాగు చేస్తూ లాభాలు గడిస్తున్నారు. గత ఏడాది సుమారు 40 మందికి పైగా రైతులు అంతర పంటల సాగు చేపట్టారు. ఈ ఏడాది పెరిగే అవకాశం ఉందని చెబుతున్నారు.

- రైతులు ఖరీఫ్ సీజన్‌లో ఎక్కువగా పత్తి, కంది, మిరప పంటలు సాగు చేస్తారు. ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలు ముగిసే సమయంలో అంతర పంటలుగా కూరగాయల సాగు ఒక రకమైతే, సాగు ఆలస్యమైన సమయంలోను అంతర పంటలు సాగు చేసుకోవచ్చని సూచిస్తున్నారు. అలాగే మొక్కజొన్న సాగులోను అంతర పంటలుగా మినుము, పెసర సాగు చేస్తున్నారు. అసలు పంట చేతికొచ్చే వరకు అంతర పంటలు పెరుగుతూ ఆదాయాన్ని అందిస్తూ ఉంటాయి. అంతర పంటలకు ప్రత్యేకంగా ఎరువులు, పురుగు మందులు పిచికారీ చేయాల్సిన పనిలేదు. కలుపులు తీయడం, అంతర సేద్యం చేయాల్సిన అవసరం ఉండదు. అసలు పంట ఆదాయం ఖర్చులకు పోతే, అంతర పంటల ద్వారా వచ్చే ఆదాయం మిగులుతుంది. తద్వారా రైతులు అధిక ఆదాయం గడించవచ్చు.

తీగజాతి కూరగాయల సాగు

ఖరీఫ్ ముగిసే సమయంలో పత్తిలో రైతులు అంతర పంటలుగా చిక్కుడు, కాకర వంటి తీగజాతి కూరగాయలు పండించే అవకాశం ఉంటుంది. కానీ రైతులు ఎక్కువగా చిక్కుడు మాత్రమే సాగు చేస్తుంటారు. పత్తి, మిరప వంటి పైర్లు దాదాపు నాలుగు నుంచి ఐదు అడుగుల ఎత్తు వరకు పెరుగుతాయి. ఇలాంటి చెట్లలో మొదళ్ల వద్ద తీగజాతికి చెందిన కూరగాయల విత్తనాలు నాటడం వలన పెద్దగా పెరుగుతూ చెట్లను అల్లుకుంటాయి. తీగలు నేలను తాకవు. దీంతో కూరగాయల మొక్కలు ఏపుగా పెరిగే అవకాశం ఉంటుంది.



పత్తిలో సాగు చేసిన మినుము పంట

పెట్టుబడి తక్కువే...

పత్తి, మిరప, కంది పంటల్లో అంతర పంటలుగా కూరగాయలు సాగు చేయడం వలన రైతులకు పెట్టుబడి తక్కువగా ఉంటుంది. కేవలం విత్తనాలు కొనుగోలు చేసి పొలంలోని సాళ్లలో విత్తుకోవాలి. సాగులో ఉన్న పైర్లకు వేస్తున్న ఎరువులు, పురుగు మందులు, అంతర పంటలపై పడటం వలన తెగుళ్లు ఆశించవు. తద్వారా ఎలాంటి పెట్టుబడి లేకుండానే కూరగాయల మొక్కలు పెరిగి పంట చేతికందుతుంది. కూరగాయలు వచ్చిన తర్వాతనే ప్రత్యేకంగా రెండు, మూడు పర్యాయాలు పురుగు మందులు పిచికారీ చేయాల్సి ఉంటుంది. ఇలా చేయడం వలన ఖర్చులు తగ్గుతాయని చెబుతున్నారు. ఖరీఫ్‌లో సాగు చేసిన పత్తి, మిరప, కంది పంటలు డిసెంబర్‌లో పూర్తవుతాయి. ఈ లోగా కూరగాయలు అంతర పంటలుగా సాగు చేయడం ద్వారా లాభాలు వచ్చే అవకాశం ఉంటుంది.

అంతర పంటలతో లాభదాయకం



పత్తి, మిరప, కంది పంటల్లో చిక్కుడు, ఆనప పంటలు సాగు చేసుకోవచ్చు. అంతర పంటలుగా ఐదు రకాలు సాగు చేస్తే ఒక సాగులో ఐదు రకాల ఆదాయం పొందే వీలుంటుంది. కేవలం విత్తనం ఖర్చుతోనే పంట చేతికి తీసుకోవచ్చు. ప్రత్యేకంగా నీటి అవసరం, మందుల అవసరం ఉండదు. ఈ విధానం వలన పొలంలో తేమ శాతం కాపాడుకోవచ్చు. భూసారం పెరుగుతుంది. ఆరోగ్యవంతమైన పంటలు వస్తాయి. కలుపు బెడద కూడా తగ్గించుకోవచ్చు. ప్రధాన పంటపై చీడపీడల బెడద తగ్గించుకోవచ్చు.

– కె.అమలకుమారి, ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

సత్తెనపల్లి: దేశ వ్యాప్తంగా జూలై 9న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) సత్తెనపల్లి మండల కార్యదర్శి పెండ్యాల మహేష్ అన్నారు. సార్వత్రిక సమ్మెలో భాగంగా ఐసీడీఎస్ సత్తెనపల్లి ప్రాజెక్ట్ జూనియర్ అసిస్టెంట్‌కు గురువారం అంగన్‌వాడీ కార్యకర్తలు, సీఐటీయూ నాయకులు సమ్మె నోటీస్ అందించారు. ఈ సందర్భంగా పెండ్యాల మహేష్ మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసి 4 లేబర్ కోడ్‌లను తీసుకువచ్చి కార్మికులకు ద్రోహం చేసిందన్నారు. కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, ఈ కోడ్స్ అమలులోకి వస్తే ప్రస్తుతం ఉన్న చట్టాలు వర్తించే కార్మికులందరూ బానిసత్వంలోకి నెట్టబడతారని, సంఘం పెట్టుకునే హక్కు పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీల సమ్మె కాలపు ఒప్పందాలను కూటమి ప్రభుత్వం అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ ప్రాజెక్టు అధ్యక్షురాలు కె.సుజాత, సెక్టార్ లీడర్లు అంజని, ప్రభావతి, కళ్యాణి తదితరులు ఉన్నారు.



సమ్మె నోటీస్ అందిస్తున్న పెండ్యాల మహేష్, అంగన్‌వాడీలు

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

పెదకూరపాడు: కార్మిక సంఘాల పిలుపు మేరకు జూలై 9న జరగనున్న దేశ వ్యాప్త సమ్మెలో పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని నియోజకవర్గ ఏఐటీయూసీ అధ్యక్షుడు మునగోటి శ్రీనివాసరావు అన్నారు. మండల కేంద్రమైన పెదకూరపాడులో గురువారం కరపత్రాలు పంపిణీ చేసి శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను నాలుగు కోడ్స్‌గా మార్చినప్పటి నుంచి కార్మికుల హక్కులు క్షీణించాయని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు విస్మరించిందని విమర్శించారు. జూలై 9న జరిగే సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు తేల ప్రసాద్, రతన్‌రాజు, సుధాకర్, నాగేశ్వరరావు, యాకోబు, శేఖర్, ఏడుకొండలు పాల్గొన్నారు.



గ్రోమోర్ సెంటర్‌లో కరపత్రాలు పంపిణీ చేస్తున్న అవ్వారు ప్రసాదరావు

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి

సత్తెనపల్లి: దేశవ్యాప్తంగా జూలై 9న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు అవ్వారు ప్రసాదరావు పిలుపునిచ్చారు. పట్టణంలోని గ్రోమోర్ సెంటర్‌లో భవన నిర్మాణ కార్మికులను కలిసి వివరాలు తెలుపుతూ గురువారం ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలన్నారు. కార్మికులకు అన్యాయం చేసే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని 9న జరిగే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి షేక్ సిలార్ మసూద్, సీఐటీయు పట్టణ కన్వీనర్ జడ రాజ్ కుమార్ తదితరులు ఉన్నారు.


ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనది

ఎంఈవోలు శ్రీనివాసరావు, రాఘవేంద్రరావు



సత్తెనపల్లి: సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని మండల విద్యాశాఖాధికారి–1 ఎ.శ్రీనివాసరావు, మండల విద్యాశాఖాధికారి–2 ఎ.రాఘవేంద్రరావులు అన్నారు. ఎస్టీయూ సత్తెనపల్లి గౌరవ అధ్యక్షుడు, సత్తెనపల్లి మండలం వెన్నాదేవి ఎంపీపీఎస్‌లో పని చేస్తున్న జి.సాల్మన్‌రాజు పదవీ విరమణ సందర్భంగా గురువారం నిర్వహించిన కార్యక్రమంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దే అవకాశం ఒక్క ఉపాధ్యాయుడికే సాధ్యమవుతుందన్నారు. ఈ సందర్భంగా సాల్మన్‌రాజు సేవలను పలువురు వక్తలు కొనియాడారు. అనంతరం సాల్మాన్‌రాజు దంపతులను దుశ్శాలువాలు, మెమెంటోలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎస్టీయూ పల్నాడు జిల్లా అధ్యక్షుడు షేక్ కరీముల్లా, జిల్లా ఆర్థిక కార్యదర్శి ఏమండీ, సత్తెనపల్లి మండల అధ్యక్షుడు రాజు, ప్రధాన కార్యదర్శి ఎ.అప్పారావు, సురేష్, వెంకయ్య, బషీర్, జాకీర్, సుధీర్ పీటర్ పాల్, సుభాని, ఏఐటీయూసీ నాయకులు శ్రీనివాసరావు, వివిధ సంఘాల నాయకులు, మిత్రులు పాల్గొన్నారు.

నేటి చలో విజయవాడను జయప్రదం చేయాలి



సత్తెనపల్లి: ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని పల్నాడు జిల్లా మున్సిపల్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు షేక్ సిలార్ మసూద్ డిమాండ్ చేశారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో గురువారం ఇంజనీరింగ్ కార్మికులను కలిసి ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ షరతులు లేకుండా సంక్షేమ పథకాలు అమలు చేయాలని ఈ నెల 4న చేపట్టే చలో విజయవాడ జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అలాగే జూలై 9న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా మున్సిపల్ యూనియన్ అధ్యక్షురాలు వంగిపరపు చంద్రకళ, పట్టణ సీఐటీయూ కన్వీనర్ జడ రాజ్‌కుమార్, ఇంజనీరింగ్ కార్మికులు ఉన్నారు.

స్వాతంత్య్రం కోసం ప్రాణాలర్పించిన మహావీరుడు అల్లూరి

సత్తెనపల్లి: స్వాతంత్య్రం కోసం పోరాడిన గొప్ప దేశ భక్తుడు అల్లూరి సీతారామరాజు అని సత్తెనపల్లి ఏరియా ప్రభుత్వ వైద్యశాల ఎముకల వైద్య నిపుణుడు డాక్టర్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. పట్టణంలోని బీసీ సాంఘిక సంక్షేమ శాఖ బాలుర వసతి గృహంలో హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతిని గురువారం నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు దేశ స్వాతంత్య్ర ఉద్యమంలో ఒక ముఖ్యమైన వ్యక్తిగా గుర్తింపు పొందారన్నారు. హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు మాట్లాడుతూ సాయుధ పోరాటం ద్వారానే స్వాతంత్య్రం వస్తుందని నమ్మి ప్రాణాలు అర్పించిన మహావీరుడు అల్లూరి అన్నారు. హాస్టల్ అధికారి రత్నబాబు అధ్యక్షత వహించారు. ముందుగా అల్లూరి చిత్రపటానికి నివాళులర్పించారు. యేల్చూరి అమ్మ చారిటబుల్ ట్రస్ట్(తెనాలి) సహకారంతో విద్యార్థులకు భోజనం ప్లేట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీచర్ మస్తాన్, ఐటీఐ కాలేజీ ప్రిన్సిపాల్ రమేష్, హెల్ప్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.



అల్లూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్ తదితరులు

డెంగీపై అవగాహన ర్యాలీ

అమరావతి: మండల పరిధిలోని అత్తలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జాతీయ డెంగీ మాసోత్సవంలో భాగంగా గురువారం డెంగీ వ్యాధిపై ప్రజలకు అవగాహన కార్యక్రమంతో పాటు ర్యాలీ నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి కవిత, పల్నాడు జిల్లా మలేరియా అధికారి రవీంద్ర రత్నాకర్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైద్యాధికారి కవిత మాట్లాడుతూ జూలై మాసం మొత్తం జాతీయ డెంగీ మాసోత్సవం నిర్వహిస్తామని అందులో భాగంగా సచివాలయాల వారీగా దోమలు పుట్టకుండా కుట్టకుండా జాగ్రత్తలపై ప్రజలకు అవగాహనా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లా మలేరియా అధికారి రవీంద్ర రత్నాకర్ మాట్లాడుతూ ప్రతి శుక్రవారం ప్రజలందరూ ఫ్రైడే డ్రై డే కార్యక్రమం నిర్వహించాలని, ఇంటి ముందు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, ఎవరైనా జ్వరంతో బాధపడుతుంటే దగ్గరలో ఉన్న ఆరోగ్య ఉప కేంద్రానికి వెళ్లి ఉచితంగా రక్త పరీక్షలు చేయించుకొని, మందులు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సత్తెనపల్లి సబ్ యూనిట్ అధికారి సుభాన్ బేగ్, పీహెచ్‌సీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



అత్తలూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో డెంగీ అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ప్రైవేట్ పాఠశాలల బంద్ విజయవంతం

సత్తెనపల్లి: ఆర్టీఈ చట్టం అమల్లో కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల విషయంలో అధికారుల ఏకపక్ష నిర్ణయాలను నిరశిస్తూ రాష్ట్ర వ్యాప్త బంద్‌లో భాగంగా గురువారం సత్తెనపల్లి నియోజకవర్గ వ్యాప్తంగా కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలలను మూసివేసి నిరసన తెలిపారు. ఏపీ ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూల్ మేనేజ్మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని 30 కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలలను స్వచ్ఛందంగా మూసివేయడంతో బంద్ విజయవంతమైంది. ఈ సందర్భంగా ఏపీ ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ స్కూల్ మేనేజ్మెంట్ అసోసియేషన్ బాధ్యులు మాట్లాడుతూ ఆర్టీఈ చట్టం అమలు చేసేందుకు ప్రభుత్వం రూపొందించిన నిబంధనలను అనుసరించి కార్పొరేట్, ప్రైవేటు విద్యా సంస్థలు రిజిస్ట్రేషన్ చేసుకున్నాయన్నారు. అయితే పాఠశాలల్లో అడ్మిషన్లు చేసే క్రమంలో అధికారుల చర్యలు యాజమాన్యాలను ఇబ్బందులకు గురి చేస్తున్నాయన్నారు. ఏకపక్ష నిర్ణయాలను నివారించి సూత్రీకరణ విధానాలతో సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఏపీ ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ స్కూల్ మేనేజ్మెంట్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు హనిమిరెడ్డి, శ్రీధర్, నియోజకవర్గ అధ్యక్షుడు సుభాని, పాఠశాలల యాజమాన్యాలు ఉన్నారు.

అధికారులు ప్రొటోకాల్ పాటించటం లేదు

మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఎంపీడీవోను నిలదీసిన వైస్ ఎంపీపీ వెంకట్రామిరెడ్డి



మాట్లాడుతున్న తహసీల్దార్ నాగరాజు

క్రోసూరు: అధికారులు ప్రొటోకాల్ కూడా పాటించటం లేదని, ప్రజా ప్రతినిధులంటే అంత నిర్లక్ష్యం వహించటం మంచిది కాదని, ఈ విషయంపై జేసీకి ఫిర్యాదు చేయనున్నట్లు వైస్ ఎంపీపీ విప్పల వెంకట్రామిరెడ్డి అన్నారు. క్రోసూరు మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో గురువారం సర్వసభ్య సమావేశం ఎంపీపీ పి.కోటయ్య అధ్యక్షతన జరిగింది. కార్యక్రమానికి వైస్ ఎంపీపీలు విప్పల వెంకట్రామిరెడ్డి, లక్ష్మి పాల్గొన్నారు. ఎంపీడీవో జి.రవికుమార్, తహసీల్దార్ వి.వి.నాగరాజు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

- వైస్ ఎంపీపీ వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ సర్వసభ్య సమావేశం ఉందని కూడా తెలియజేయటం లేదని ఎంపీడీవోని అడిగగా, దీనిపై ఎంపీడీవో స్పందిస్తూ పొరపాటు జరగకుండా చూసుకుంటానని తెలిపారు.
- ఎంపీపీ కోటయ్య మాట్లాడుతూ పంచాయతీల్లో కాలువలు, వీధులు ఆక్రమణలకు గురవుతున్నాయని, తద్వారా మురుగు పారటం లేదని సమావేశం దృష్టికి తెచ్చారు. దీనిపై ఎంపీడీవో పంచాయతీ కార్యదర్శులకు తగు చర్యలు తీసుకొనేందుకు ఆదేశాలు ఇచ్చారు.
- గ్రామంలో గ్రామ కంఠాలు రిజిస్ట్రేషన్ చేయటం లేదని ఒక ప్రజా ప్రతినిధి ప్రశ్నించగా తహసీల్దార్ వివరిస్తూ గ్రామ కంఠాలు తమ పరిధిలోకి రావని పంచాయతీల్లో తెలుసుకోవాలన్నారు.
- విద్యుత్ సమస్యలపై పలువురు ఎంపీటీసీ సభ్యులు మాట్లాడుతూ పెదకూరపాడు నియోజకవర్గంలోని క్రోసూరు, అచ్చంపేట, అమరావతి, పెదకూరపాడు మండలాలను విద్యుత్ శాఖ పరిధిలో రూరల్ సబ్ డివిజన్ చేసి నరసరావుపేట నుంచి చిలకలూరిపేట కిందకు చేర్చాలని చూస్తున్నారని, అలా చేస్తే తమ ప్రజలకు చాలా కష్టతరమవుతుందని, అలా కాకుండా నరసరావుపేటలోనే ఉంచాలని కోరారు. ఈ విషయమై ఎమ్మెల్యే, ఎంపీ దృష్టికి తీసుకెళ్లామని అధికారులు తెలిపారు.
- దొడ్లేరు ఎంపీటీసీ నాగయ్య మాట్లాడుతూ ఉపాధి వేతనాలు కనీస వేతనం రూ.307 పడటం లేదని, కొన్ని సార్లు రూ.80 మాత్రమే వస్తున్నాయని అడగగా.. ఏపీవో వెంకటేశ్వరరావు సమాధానమిస్తూ ఇచ్చిన కొలతల ప్రకారం చేసుకున్న పని మేరకు వేతనాలు వస్తుంటాయని, ప్రభుత్వం ఇస్తున్న కనీస వేతనం రూ.307 వచ్చే విధంగా పనులు చేసుకోవచ్చునని అన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా గ్రావెల్ అక్రమ తవ్వకాలు

అమరావతి: మండల పరిధిలోని ఎండ్రాయి గ్రామంలో యథేచ్ఛగా గ్రావెల్ అక్రమ తవ్వకాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవటం లేదని పల్నాడు జిల్లా బీజేపీ కిసాన్ మోర్చా కార్యదర్శి గోగినేని వెంకటరమణ అన్నారు. గురువారం ఆయన గ్రావెల్ అక్రమ తవ్వకాలపై మాట్లాడుతూ గ్రావెల్ మైనింగ్ మాఫియా గత కొంత కాలంగా ఎండ్రాయి గ్రామ పరిధిలోని అసైన్డ్ భూముల్లో ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా గ్రావెల్‌ను రాత్రి పగలు తేడా లేకుండా వందల భారీ లారీలతో తరలిస్తున్నా అధికారులు చూసీచూడనట్లు వదిలేస్తున్నారన్నారు. ఈ విషయంపై గ్రామ వీఆర్‌వో, తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినా, ఫొటోలు పంపినా, మైనింగ్ జరిగేటప్పుడు సమాచారం ఇచ్చినా పట్టించుకోవటం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు మొద్దు నిద్ర వీడి గ్రావెల్ అక్రమ తవ్వకాలను నిలువరించాలని లేకుంటే ఆధారాలతో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు.



ఎండ్రాయి పరిధిలోని గ్రావెల్ అక్రమ తవ్వకాలు నిర్వహిస్తున్న దృశ్యం

జాతీయ స్థాయిలో ప్రతిభ చూపడం అభినందనీయం

సత్తెనపల్లి: కర్ణాటకలో ఇటీవల జరిగిన జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో సత్తెనపల్లికి చెందిన ఇరువురు క్రీడాకారులు స్వర్ణ, రజత, కాంస్య పతకాలు సాధించి ప్రతిభ చూపటం అభినందనీయమని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణ రఘురామ్‌నగర్‌లోని తన కార్యాలయంలో గురువారం ప్రతిభ చూపిన క్రీడాకారులను ఆయన అభినందించి మాట్లాడుతూ నిత్యం సాధన చేస్తూ భవిష్యత్తులో అన్ని పోటీల్లోనూ ప్రతిభ చూపాలన్నారు. క్రీడాకారులను ప్రత్యేకంగా అభినందించారు. సత్తెనపల్లి పట్టణానికి చెందిన వసుపులేటి వంశీకృష్ణ 83 కిలోల విభాగంలో మొత్తంగా 735.5 కిలోలు ఎత్తి రెండు స్వర్ణ పతకాలు, మండలంలోని కంకణాలపల్లికి చెందిన ఎస్.శరత్ 74 కిలోల విభాగంలో మొత్తంగా 723 కిలోలు ఎత్తి కాంస్య పతకాలు సాధించారని కోచ్, పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ పల్నాడు జిల్లా సెక్రటరీ వసుపులేటి సురేష్ చెప్పారు. అలాగే గుడిపూడికి చెందిన లింగిసెట్టి శివ నాగేశ్వరరావు 120 కేజీల విభాగంలో సౌత్ ఇండియా కాంపిటీషన్‌లో 680 కిలోలు ఎత్తి బంగారు పతకం సాధించాడన్నారు. కార్యక్రమంలో పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జిమ్ రాజు తదితరులు ఉన్నారు.



క్రీడాకారులను అభినందిస్తున్న ఎమ్మెల్యే కన్నా

రెవెన్యూ సదస్సులో ఫిర్యాదు చేసినా పరిష్కారం కావడం లేదు

వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు రవికుమార్

అచ్చంపేట: భూ సమస్యల పరిష్కారం కోసం ఆరు నెలల క్రితం రెవెన్యూ సదస్సులో ఇచ్చిన ఫిర్యాదులు ఇంతవరకు పరిష్కారానికి నోచుకోలేదని వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు గంజిమాల రవిబాబు అన్నారు. అసైన్డ్ భూముల హక్కులను కాపాడాలని కోరుతూ చెరుకుంపాలెం రైతులతో కలసి ఆయన గురువారం స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి, తహసీల్దారు ఎం.సరోజకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రవిబాబు మాట్లాడుతూ చెరుకుంపాలెంలో నిరుపేద రైతులకు 1993లో భూములు కేటాయించి పట్టాలు కూడా ఇచ్చారని, కొంత మంది రైతులు సాగునీటి వసతి లేక భూములను అభివృద్ధి చేసుకోలేకపోయారని, ప్రస్తుతం సాగు చేసుకునేందుకు వెళ్లగా అటవీ శాఖాధికారులు కేసులు పెట్టి రైతులను ఇబ్బందులకుగురిచేస్తున్నారరెవెన్యూ సదస్సులో వినతిపత్రాలు అందజేసినా, కలెక్టర్ ఆదేశించినా సమస్య కొలిక్కి రాలేదన్నారు. తక్షణమే అధికారులు స్పందించి రైతులకు భూములపై హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. తహసీల్దారు సరోజ మాట్లాడుతూ రికార్డులు పరిశీలించి పరిష్కారానికి ప్రయత్నిస్తానన్నారు. రైతు సంఘ నాయకులు హనుమంతరావు, రావెల వెంకటేశ్వర్లు, షేక్ హసన్, కేకే రెడ్డి, రైతులు సుంకర వెంకటేశ్వర్లు, సుంకర భానురావు, చిల్కా జార్జి, దుప్పలపూడి మరియమ్మ, కె.సంధ్య పాల్గొన్నారు.



తహసీల్దారు సరోజకు వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘాల నాయకులు, బాధిత రైతులు

స్మార్ట్ మీటర్లను ఇళ్లకు బిగించొద్దు

సత్తెనపల్లి: అదానీ విద్యుత్ స్మార్ట్ మీటర్లను ఇళ్లకు బిగించొద్దని, బిగించేందుకు వస్తే అడ్డుకోమని సీపీఎం పట్టణ కార్యదర్శి షేక్ మస్తానవలి పిలుపునిచ్చారు. పట్టణంలోని నాగార్జున నగర్‌లో గురువారం అదానీ విద్యుత్ స్మార్ట్ మీటర్లను ఇళ్లకు బిగించొద్దని డోర్ టు డోర్ ప్రచారం నిర్వహించి కరపత్రాలను పంపిణీ చేశారు. విద్యుత్ స్మార్ట్ మీటర్ల వల్ల కలిగే నష్టాలను వివరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు హనుమంతరావు, జడ రాజ్‌కుమార్ తదితరులు ఉన్నారు.



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీపీఎం నేతలు